విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 21 ఆగస్టు 2025 8 పేజీలు

శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: సెప్టెంబర్ 24వ తేది నుండి అక్టోబర్ 2వ తేది వరకు తిరుమలలో నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో చేస్తున్న ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పీహర్షవర్ధన్ రాజు, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు.ఈ సందర్భంగా గ్యాలరీల్లో భక్తులు ఇబ్బంది పడకుండా వాహన సేవలను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ మొదటి వారంలోపు ఇంజినీరింగ్ పనులు

2లో

కార్మిక వర్గం కదలాలి

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సన్నద్ధం కండి : ఏఐటియుసి

విశాలాంధ్ర – పుత్తూరు : ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి పుత్తూరు డివిజన్ రెండవ మహాసభలు అంబేద్కర్ భవన్లో ఘనంగా జరిగాయి. ఈ మహాసభల కు ముఖ్య అతిధులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి కే.రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 105 సంవత్సరాల గణ చరిత్ర కలిగిన ఏఐసియుసి పుత్తూరు ప్రాం తంలో రెండవ మహాసభలు జరుపుకుంటుందని గడచిన రెండు సంవత్సరాల కాలంలో పుత్తూరు ప్రాంతంలో హమాలీ కార్మికుల కూలీల పెంపుకు సంబంధించి ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జరిగిన పోరాటాలు ఆటో కార్మికులకు హమాలీ కార్మికులకుఅసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ చట్టం కోసం జరుగుతున్న జరిగిన పోరాటాలను సమీక్షించుకొని అలాగే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం రాష్ట్రంలో తిరిగి పునరుద్ధరించాలని జరుగుతున్నటువంటి పోరాటాల ను సమీక్షించి గడచిన 14 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపరిచే విధంగా సాగిస్తున్న పోరాటాలు విజయవంతం కావాలని

2లో

దర్జాగా..

విద్యుత్ చౌర్యం

విశాలాంధ్ర-వెదురుకుప్పం:

దర్జాగా విద్యుత్ చౌర్యం.

సామాన్య జనాలు కానేకాదు.

సాక్షాత్తు ప్రభుత్వ కార్యాలయాలలో ఎటువంటి సర్వీసులు లేకుండా చౌర్యం.

చూసీ చూడనట్లు సంబంధిత అధికారులు.

సామాన్య ప్రజానీకంపై అదనపు చార్జీల మోత.

జాడే లేని నిఘా అధికారులు.

అసలేం జరుగుతోందంటే..: వెదురుకుప్పం మండలంలో 222 గ్రామాలు,25 గ్రామ పంచాయతీ లు ఉన్న ఈ పరిధి లో 8 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి.ఈక్రమంలో మండల కేంద్రం తో పాటు ప్రతి పంచాయతీ లో ప్రభుత్వ కార్యాలయ భవనాలు వివిధ ప్రభుత్వ శాఖల నిర్వహణ లో ఉన్నాయి.అయితే భవనాలు నిర్మించి సంబంధిత అధికారులు ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తూ వున్నారు.విద్యుత్ సర్వీసులు పొందకుండా దర్జాగా విద్యుత్

2లో

- ప్రభుత్వ కార్యాలయాల సాక్షిగా
- పేదలపై అదనపు చార్జీల మోత
- నిద్రావస్థలో నిఘా

అర్హులైన వికలాంగులందరికీ..

పింఛన్లు ఇవ్వాలి

విశాలాంధ్ర – రేణిగుంట : వికలాంగుల పెన్షన్ రద్దు చేసిన వారందరికీ పునరుద్ధరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో రేణిగుంట అంబేద్కర్ విగ్రహం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని పునరుద్ధరణ పేరుతో వికలాంగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వ హాస్పిటల్ లో సదరం సర్టిఫికెట్‌లో పర్సంటేజ్ తగ్గిస్తూ, పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి పింఛన్లు నిలిపివేస్తున్నారని

2, 4లో

- అంగవైకల్యం 50% ఉన్నవారికి పింఛన్లు ఇవ్వాలి
- పింఛన్లు రద్దు చేసిన వికలాంగులందరికీ పునర్ధరించాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసనలు

తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

- రాష్ట్రంలో ఒకేసారి ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాలు ప్రారంభం
- స్టార్టప్ కంపెనీలకు ఇదొక మంచి ప్లాట్‌ఫాం
- గడచిన 24 గంటల్లో 1.60 లక్షల రిజిస్ట్రేషన్లు
- తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు ఆనందదాయకం : ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర – శ్రీకాళహస్తి: అమరావతి కేంద్రంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించ డంతో పాటు వర్చువల్‌గా తిరుపతి, విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురంలో ఏర్పాటు చేసిన ఐదు స్పోక్స్ కేంద్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. బుధవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన తిరుపతి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాన్ని కలెక్టరు డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్లు ఆచార్య అప్పారావు, జాయింట్ కలెక్టర్ శు భం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీతో కలిసి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన అనం తరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణంలో

2లో

శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో

(మొదటి పేజీ తరువాయి) పూర్తి చేయాలని చెప్పారు.అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ. సెప్టెంబర్ 24వ తేది ధ్వజారోహణం రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో భద్రతా చర్యలపై క్షేత్రస్థాయిలో చర్చించడం జరిగిందన్నారు. మాడ వీధుల్లో అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్యం కోసం అదనపు సిబ్బంది నియమించనున్నట్లు తెలిపారు.గ్యాలరీల్లో ఉన్న ప్రతి భక్తుడికి అన్న ప్రసాదాలు అందేలా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది గరుడవాహన సేవకు 3 లక్షలకు పైగా భక్తులు విచ్చేశారని, అందుకనుగుణంగా ఈ ఏడాది అదనపు ట్రిప్పులు తిప్పేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించామన్నారు. తిరుమలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తుగా పార్కింగ్ ప్రణాళికలు రూపొందించి తిరుపతిలో కూడా పార్కింగ్ లు ఏర్పాటు చేసి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు వచ్చేలా చర్యలు చేపట్టామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో లోకనాథం, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం

(మొదటి పేజీ తరువాయి) దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఉదాహరణకు బొమ్మయ్య పల్లి గ్రామ సచివాలయం భవనం కు కరెంటు సర్వీసు లేకుండా విద్యుత్ వాడుతూ సచివాలయ నిర్వహణ జరుగుతోంది. అదేవిధంగా మండల కేంద్రం లోని రైతు సేవా కేంద్రంతో పాటు మరికొన్ని ఆశాఖ భవనాలకు విద్యుత్ సరఫరా అనుమ తులు లేకపోయినా దర్జాగా విద్యుత్ వాడుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య ప్రజలు అక్రమంగా విద్యుత్ వాడుకుంటే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. విద్యుత్ చౌర్యం నేరం అని తెలిసిన ప్రభుత్వ అధికారులు సైతం చౌర్యం జరుతున్నా పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.ఈ విద్యుత్ దోపిడీ వల్ల సామాన్య విద్యుత్ వినియోగదారులపై అదనపు చార్జీల పేరుతో మోత మోయిస్తుండడం పై మండిపడుతున్నారు.ప్రభుత్వ శాఖల పరిధి భవనాల్లో విద్యుత్ చౌర్యానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఇదే విషయమై కార్వేటినగరం ఏపీఎస్పీడిసిఎల్ ఏడీఈ వివరణ కోరగా ప్రభుత్వ భవనాల లో విద్యుత్ అనుమతులు లేకుండా అక్రమ వాడకం మా దృష్టికి రాలేదు. రేపు పరిశీలన చేసి సంబంధిత వారిపై చర్యలు నిమిత్తం కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తానమని,విద్యుత్ చౌర్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.

కార్మిక వర్గం కదలాలి

(మొదటి పేజీ తరువాయి) ఏఐటీయూసీ విస్తరణ నిర్మాణం పై ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రాంతంలో పనిచేయాలి అని వారు అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని ఆ రకంగా 44 కార్మిక చట్టాలు రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కులు ప్రైవేట్ పరం హనివ్వకుండా ఆపటం లో పోరాటంలో ఏఐటియుసి విశేషమైన కృషి చేసిందని అయినా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుగా కార్మిక వర్గాన్ని కదిలించడంలో అలాగే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కును కాపాడటం కోసం జరుగుతున్న పోరాటాలు అయినా కేంద్ర ప్రభుత్వం 44 విభాగాలను ప్రైవేటుపరం చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోడీ మెప్పుకోసం ఈ రాష్ట్రా న్ని రాష్ట్ర హక్కులను పణంగా పెడుతుందని కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కనీసం నోరు విప్పి మాటలాడలేని మూగ ప్రభుత్వమే ప్రభుత్వం అనుసరిస్తుందని వీటన్నిటికీ వ్యతిరేకంగా రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు ఏఐటియుసి శ్రీకారం చుడుతుందని అందులో పుత్తూరు ప్రాంత కార్మిక వర్గం కథలాలని కదిలించడం కోసం ఏఐటియుసి శ్రేణులు కృషి చేయాలి అని వారు పిలుపునిచ్చారు. ఇంకా ఈ మహాసభ ప్రారంభ సూచికంగా జెండాను ఆవిష్కరించడం జరిగింది . ఈ మహాసభలకు గోపి అధ్యక్షత వహించగా ఈ మహేష్ చంద్రబాబు రమణయ్య మారెమ్మ శరవణ తదితరులు ప్రసంగించారు.ఈ మహాసభకు హాజరైన కార్మిక నాయకులు బాబు మేస్త్రి రమేష్ భారతి కృష్ణారెడ్డి మునికృష్ణ తులసిఅంకమ్మవిజయ్ వెంకట ముని రమేష్ పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

- సర్కిల్ ఇన్స్పెక్టర్ సుదర్శన ప్రసాద్



విశాలాంధ్ర - పాకాల : వినాయక చవితి పండగ సందర్భంగా పాకాల సర్కిల్ పరిధిలోని గ్రామాలు, పట్టణ వీధులలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయదలచి నవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సిఐ సుదర్శన్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినాయక విగ్రహాల ఏర్పాటు అనుమతుల కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భారీ ఎత్తున టపాకాయలు కాల్చరాదని అలాగే డి జె సౌండ్ తో పాటలు , డాన్సులు నిషేధిస్తున్నా మన్నారు. ప్రజలందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పింఛన్లు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి) వాపోయారు. వికలాంగుల ప్రతిరోజు వందలాదిమంది సచివాలయాలు, కలెక్టర్ కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. తిరుపతి నగరంలోని వందలాదిమంది వికలాంగులకు పింఛన్లు రద్దు చేశారని, వికలాంగులకు అన్ని అర్హతలు ఉన్న సచివాలయంలో అప్లై చేస్తుంటే అనర్హులుగా గుర్తిస్తున్నారన్నారు. పింఛన్లు రద్దు చేసిన వికలాంగులు ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది విచారణ జరిపి వారు అర్హులు కాదా నిజ నిర్ధారణ చేసి వారికందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు. కొంతమంది వికలాంగులకు పర్సంటేజ్ తక్కువ ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని అనేక నిబంధనలతో వికలాంగులను హింసిస్తూ పింఛన్లు కట్ చేస్తున్నారని అన్నారు. తక్షణమే అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే మహిళలకు ఆర్టీసీ బస్సులు ఫ్రీ అని రాష్ట్రంలో ఎక్కడైనా ఎక్కొచ్చు దిగొచ్చు అని ఆగస్టు 15వ తారీఖున రాష్ట్రమంతా పండుగ వాతావరణంలో నిర్వహించారని ఇప్పుడు మహిళలు బస్సు ఎక్కితే ఈ బస్సు ఫ్రీ కాదు వేరే బస్సు ఎక్కండి మహిళలని తీవ్రమైనటువంటి ఇబ్బందులు గురి చేస్తూ ఉన్నారని ఫ్రీ అన్న తర్వాత ఆర్టీసీ బస్సు ఏ బస్సు ఎక్కిన ఫ్రీగా మహిళలకు వర్తించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తులసిరాజన్, ఏఐటియుసి మండల కార్యదర్శి కార్తీక్,మురళి, చంద్రకళ,సుబ్బరాజు, రమణ అమ్ములు, ఖాదరవల్లి,శివగామి, మనీ , మున్ని,విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

(మొదటి పేజీ తరువాయి) జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ముఖ్య ఆహ్వానితులు తిలకించారు. అనంతరం ఐదు స్పోక్స్ కేంద్రాలలో కార్యక్రమానికి హాజరైన వారు ఆవిష్కరణ ఆంధ్ర ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా మీడియాతో శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... నేడు ఎన్డీయే ప్రభుత్వం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఇది యువ పారిశ్రామికులు, తమ స్వంత స్టార్టప్ వ్యాపారం మొదలు పెట్టాలనుకునేవారికి అద్భుతమైన అవకాశమన్నారు. ఎవరైనా మంచి ఆలోచనలు కలిగి... ఉత్సాహం ఉన్న వారు ఒక మార్గదర్శకత కోసం, మంచి కారణం కోసం వేచి చూస్తున్న వారి కోసం ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ గొప్ప అవకాశంగా మారుతుందన్నారు. గడిచిన 24 గంటల్లో 1.60లక్షల మంది యువకులు తమ కంపెనీలు స్టార్ట్ చేసేందుకు రిజిస్టరు చేసుకున్నారన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్లో కొత్త వరల్డ్ రికార్డ్ గా మారిందన్నారు. చంద్రబాబు గురించి వినగానే తనకు ఒక ఆలోచన వచ్చిందని, కష్టపడి చదివి ఏదో ఒకటి అవ్వాలని కోరుకునే ప్రతి యువతీ యువకులకు ఇది మంచి అవకాశం అన్నారు. ఈ హబ్ ద్వారా రతన్ టాటా ఎప్పటికీ అందరి మదిలో చిరస్థాయిగా నిలచిపోతారన్నారు. నేడు ఒకేసారి ఐదు చోట్ల రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్స్ కేంద్రాలను మొదలు పెట్టారన్నారు. ఆ ఐదింటిలో ఒకటి తిరుపతి కావడం తనకు చాలా గర్వకారణంగా ఉందన్నారు. అలాగే ప్రతి ఎంట్రప్రెన్యూర్కి కూడా ఒక లక్ష్యం ఉంటుందన్నారు. విజన్ 2020 అని ముఖ్యమంత్రి అన్నప్పుడు అందరు నవ్వుకున్నారని, అది సాకారం అయ్యాక ముఖ్య మంత్రి ముందు చూపు ఏమిటో అందరికి తెలిసిందని, అదే క్రమంలో నేడు విజన్ - 2047 ను మన ముందుకు తెచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి దూరదృష్టి ఉన్న నాయకుడన్నారు. ఆయన ఎప్పుడూ యువ వ్యాపారులను సరైన దారిలో నడిపే వ్యక్తిగా ముందుంటారన్నారు. కలెక్టరు డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ... నేడు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, స్పోక్స్ కేంద్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఇది ఇన్నోవేషన్, ఇన్క్యుబేషన్ కోసం హబ్ అండ్ స్పోక్ మోడల్. హబ్ అమరావతిలో ఉంటుందని, రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతి లలో ఐదు స్పోక్స్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి స్పోక్ కేంద్రంలో ఒక లీడ్ పార్ట్నర్ ఉంటారని... తిరుపతికి అదాని లీడ్ పార్ట్నర్ అన్నారు. వారితో పాటు మరో రెండు కంపెనీలైన నవయుగ, అమరరాజా లు కూడా లీడ్ పార్ట్నర్ లుగా... ఇవి కాకుండా నాలెడ్జ్ పార్ట్నర్ గా ఐఐటీ ఉందన్నారు. ఇది ప్రభుత్వ, కార్పొరేట్, అండ్ అకడమిక్ రంగాల సమ్మేళనమన్నారు. అందరం కలిస్తేనే ఇన్నోవేషన్ సాధ్యమని, ఒక్క సెక్టార్ మాత్రమే కాదు, మనమందరం కలిసి పనిచేస్తేనే కొత్త ఆలోచనలు వెలువడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, ప్రజాప్రతినిధులు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కేంద్ర ప్రభుత్వ అధికారి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఢిల్లీకి చెందిన కేంద్ర ప్రభుత్వ అధికారి సంజీవకుమార్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి లో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-తిరుపతి: నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను బుధవారం ఉదయం కమిషనర్ ఎన్. మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలోని నిమ్మకాయల వీధి, మిట్ట వీధి, రాములవారి గుడి వీధి, కాళికమ్మ గుడి తగితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు కుడితి సుబ్రమణ్యం, శైలజ, అధికారులతో కలసి పరిశీలించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉండడం తో నీరు అక్కడే ఆగి పోయి అపరిశుభ్రత అవుతోందన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని కాలువలు శుభ్రం చేసి, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా తొలగించాలని అన్నారు. ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తే నగరం సుభ్రంగా ఉంటుందని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మధు, డి. ఈ లు రాజు, శిల్ప, సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

రికార్డులు, బిల్లులు సమర్పించి పంచాయతీ ఆడిటింగ్ పూర్తిచేసుకోండి

పంచాయతీ సెక్రటరీ సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమరావు

విశాలాంధ్ర-సత్యవేడు: ఆడిటింగ్ అధికార బృందానికి పంచాయతీ ఆదాయ వ్యయాలకు సంబంధించి రికార్డులు,బిల్లులను సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలని సత్యవేడు ఎంపీడీవో త్రివిక్రమరావు కోరారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడిటింగ్ అధికారుల బృందంతో కలిసి ఆయన ఆడిటింగ్ పై పంచాయతీ సెక్రటరీలకు పలు సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిటింగ్ జరుగుతుందన్నారు.ప్రతి పంచాయతీకి వివిధ పద్దుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన ఆదాయ వ్యయాలను ఆడిటింగ్ అధికార బృందం పరిశీలన జరుగుతుందన్నారు. అందువల్ల ప్రతి పంచాయతీ సెక్రటరీ సంబంధించిన రికార్డులు ,బిల్లులను సమర్పించి ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలన్నారు.కాగా మండల పరిషత్ నిధుల ఆదాయ,వ్యయాల సంబంధించిన ఆడిటింగ్తో పాటు 28 పంచాయతీల ఆడిటింగ్ నిర్వహించడానికి ఆడిటింగ్ బృందం సమాయత్తమయ్యారు.ఈ నేపథ్యంలో జిల్లా అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి రామకృష్ణంరాజు, సీనియర్ ఆడిటర్లు సాయిశంకర్ అయ్యప్ప, పార్వతి తదితరుల బృందం బుధవారం నుంచే ఆడిటింగ్ ప్రారంభమ య్యాయి.ఈ సమావేశంలో మండలంలోని పలు పంచాయతీల పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

మహిళ మెడలో చైను లాక్కెళ్లిన దొంగలు

విశాలాంధ్ర-వి.కోట: మండల కేంద్రంలోని పాత పోస్టాఫీసు వీధిలో గురువారం ఉదయం ఓ మహిళ మెడలో గుర్తు తెలియని దొంగలు చైను లాక్కెళ్లారు. వివరాల్లోకి వెళితే స్థానికంగా ఉంటున్న అమరమ్మ అనే మహిళ పిల్లలను తీసుకుని వెళుతున్న సమయంలో నల్లరంగు అపాచీ వాహనంపై హెల్మెట్ ధరించి ఒకరు టోపీ ధరించి మరొకరు వేగంగా వస్తూ

అమరమ్మ మెడలోని తాళిబొట్టు చైను లాక్కున్నారు. హఠాత్పరిమాణం నుండి బాధితురాలు కోలుకునే సమయానికి దొంగలు ప్రధాన రహదారి నుండి పారిపోయారు. దొంగలు ఇద్దరూ యువకులే కావడంతో పాటు వారు వెంట తెచ్చుకున్న వాహనానికి వెనుకా ముందు నంబరు ప్లేట్లను తొలగించారు.ఇదిలా ఉండగా బాధితురాలు అమరమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన సిఐ సోమశేఖర్ రెడ్డి సంఘటన జరిగిన స్థలం నుండి దొంగలు పారిపోయిన దారుల్లో ఉన్న సిసి కెమెరాలు పరిశీలించారు. మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటన పై మహిళలు భయభ్రాంతులకు లోనౌతున్నారు.

మండల పరిషత్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరిలో నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయ పనులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం పరిశీలించారు. రెండవ అంతస్తు స్లాబ్ పనులను ఎంఎల్ఏ నాని ప్రారంభించారు. చంద్రగిరి పట్టణానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి మండల స్థాయి అధికారులు కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. గత రెండు నెలల క్రితం సుమారు 3కోట్ల రూపాయలతో నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు.అనంతరం నూతన ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న పనులను పురోగతిని పరిశీలించి త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు.అనంతరం గోవిందధా మంలో పనులను ఆయన పరిశీలించారు. అందరి సహకారం తీసుకొని పనులు వేగవంతం చేయాలని కమిటీ సభ్యులను కోరారు. గతంలో గోవింద ధామంకు సుమారు 50 లక్షల వరకు డబ్బులు దాతలు ప్రకటించారు.గోవింద ధామం పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ , కమిటీ సభ్యులుకు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కాంట్రాక్టర్, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలకు టేబుళ్లు విరాళం

విశాలాంధ్ర - రేణిగుంట : రేణిగుంట మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలోని అన్నా స్వామి పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల కు బుధవారం తిరుపతి ఐడిబిఐ బ్యాంక్ తరపున రూ.700 00 విలువ చేసే 13 టేబుల్ల ను ఏజీఎం శ్యాంప్రసాద్, బ్రాంచ్ హెడ్ రమేష్, మేనేజర్ బి.వి.శరత్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీజనల్ హెడ్ సాయి కృష్ణ ఆదేశాల మేరకు సిఎస్ఆర్ నిధులలో పాఠశాలకు తమ వంతు సహాయంగా ఈ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. పాఠశాల కో ఆప్షన్ సభ్యులు జూలియన్ రాజు మాట్లాడుతూ తన మాటకు గౌరవం ఇచ్చి పాఠశాలకు సహాయం చేసిన బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం బ్యాంకు ఉద్యోగులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభరాణి, శశికళ,ముని, మనోహర్, యాగయ్య,నాగమ్మ, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

విశాలాంధ్ర-రేణిగుంట: రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో బుధ వారం టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవం జరుగుతున్న సమయంలో ఓ వృద్ధుడు హఠాత్తుగా మూర్ఛకు గురయ్యాడు. అర్బన్ సీఐ జయచంద్ర స్పందించి వెంటనే అతని చేతికి బీగాలు ఇచ్చి పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న పోలీసులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, ట్రైనీ ఎస్సై స్వాతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తీసుకువచ్చిన సంస్కర ణలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు,యువతకు 18 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ఓటు హక్కు కల్పించడం వంటి అంశాలను తీసుకుని వచ్చి ప్రజాస్వామ్యంలో బాగసాము లనుచేయడం,ఆయన తీసుకొని వచ్చిన సాంకేతిక విప్లవాన్ని నేడు అనుభవిస్తున్నామని అన్నారు...ఎన్నికల ప్రచారంలో బాగంగా తమిళనాడులోని శ్రీ పేరంబురులో పాణాలను కోల్పోవడం జరిగిందని , ఆయన లేని లోటు కాంగ్రెస్ పార్టీకి తీరనిదని అన్నారు...ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను నాయకులు కొనియాడారు.. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూల చంద్రశేఖర్, రాష్ట్ర బిసి సంఘం నాయకులు గుంటమడుగు సుబ్బరామరాజు,.రావూరి బ్రహ్మయ్య,చిల్లకూరు మండలం అధ్యక్షుడు వేమయ్య , నాయకులు మూర్తి,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పేటమిట్టలో జాబ్ మేళాను ప్రారంభించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

విశాలాంధ్ర - పూతలపట్టు : పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ప్రారంభించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పేటమిట్ట అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నందు నిర్వహించిన జాబ్ మేళా ప్రారంభోత్స వానికి ముఖ్య అతిధిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ని స్థానిక నాయకులు, అమరరాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు దుశ్శాలువలు, పూలమాలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. అనంతరం జాబ్ మేళాలో పాల్గొనే కంపెనీ ప్రతిని ధులతో ఎమ్మెల్యే మాట్లాడి విద్య, నైపు ణ్యం తగినట్టు ఉద్యోగం కల్పిం చాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఈ జాబ్ మేళలో ఎంపికైన యువతే యువకులకు అపాయింట్మెంట్ ఆర్డర్స్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసన సభ్యులు మురళీమోహన్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువ త భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి వివిధ కంపె నీలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తూనే మరో వైపు జాబ్ మేళాలను నిర్వ హించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తు న్నట్లు చెప్పా రు. ఈ అవకాశాన్ని చదువుకున్న యువతీ, యువకులు సద్విని యోగం చేసుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆయన ఆకాం క్షించారు. జాబ్ మేళా లో ఉద్యోగం పొందని నిరుద్యోగులకు కోసం త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కల్పించి జాబ్ మేళాను నిర్వహి స్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజక వర్గం పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరిధర్‌బాబు, బంగారు పాలెం మండల అధ్యక్షులు ఎన్ పి ధరణి నాయుడు, తవణంపల్లి మండలం అధ్యక్షులు వెంకటేష్‌చౌదరి, బంగారుపాలెం మార్కెట్ డైరెక్టర్ గురుస్వామి, పేటమిట్ట గ్రామ సర్పంచ్ గల్లా రాధాకృష్ణ నాయుడు మరియు అమర్ రాజా ప్రతినిధులు, వివిధ కంపెనీల ప్రతినిధులు,ప్రభుత్వ అధికారులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సముద్రాల బత్తెయ్యనాయుడు ఆధ్వర్యంలో ఈ వేడుకలు చేశారు. ఇందులో భాగంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బత్తెయ్యనాయుడు ఈ సందర్భంగా కోరుకున్నారు. కార్యక్రమంలో జనా ర్ధన్ రెడ్డి, ఈర్ల గోపి, సురేష్, అనిల్, నాగూర య్య, మోహన్, ఆర్ముగం, నరేంద్ర, వానమ్మ, బానమ్మ, మస్తానమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండల పరిధిలోనే డిఎం పురం పంచా యతీ కరవాటికంటే గ్రామం నుండి మచ్చల పట్టాభి వర్ధంతి సందర్భంగా భార్య రాణమ్మ, కుమార్తెలు, ఎం దీప్తి, కిషోర్ యాదవ్, నరేష్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్త శ్రీ, ధీరజ్, దీక్షిత్,దిశాంత్, లోకియాన్, రాస్ పర్యవేక్షకులు ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లను వేగవంతం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఇన్‌స్పైర్ నామినేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా సైన్సు అధికారి భానుప్రసాద్ కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పుత్తూరు డివిజన్ లోని అన్ని యాజమాన్యాల సైన్స్ ఉపాధ్యాయులతో ఇన్స్పైర్ అవార్డు-2025 నామినేషన్లకు సంబంధించి ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు భానుప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ప్రతి పాఠశాలలో ఇన్నోవేషన్ ఐడియా బాక్స్ ను ఏర్పాటు చేయాల న్నారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థుల వినూత్న ఆలోచనలతో కూడిన ఎగ్జిబిట్లతో 5 నామినేషన్లు చేయించాలని కోరారు. శిక్షణా కార్యక్రమంతో పాటు అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు వీరేశ్, ప్రేమ కుమార్ అగస్త్య వర్చువల్ పాఠశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భువనేశ్వరి, భారతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, రిసోర్స్ పర్సన్లు కామాక్షయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ, లింకన్, రుద్రయ్య, మూర్తి, స్టాలిన్ పాల్గొన్నారు.

దోమల నివారణతోనే వ్యాధులకు దూరం

- హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్

విశాలాంధ్ర- రేణిగుంట: దోమల నివారణతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని తారకరామా నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్ తెలియజేశారు. బుధవారం ఆర్. సి.ఎం. హై స్కూల్ నందు బుధవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ శివ శంకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరంఆగష్టు 20 తేది న ప్రపంచ దోమల దినోత్సవం ను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అలాగే ప్రతి సంవత్సరం ఆగష్టు 20 వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవంనుజరుపుకుంటున్నామన్నారు. సర్ రోనాల్డ్ రాస్ అను శాస్త్రవేత ఆడ అనాఫీలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని గుర్తించిన రోజును ప్రపంచం దోమల దినోత్సవంగా పాటించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగేనీటినిలువలు లేకుండా,దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. దోమల నివారణకు,దోమతెరలు వాడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, నీటి నిలువలు ఐదు రోజులకు మించి ఉంచరాదన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు, వంటి వ్యాధులపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ప్రజలకు దోమల ద్వారా వచ్చు వ్యాధు ల పై అవగాహన కల్పించాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, తెలియజేసారు. ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి స్రవంతి, ఆరోగ్య కార్యకర్త, ఏఎన్ఎం, రేవతి, ఆశా కార్యకర్తలు పద్మ, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలి

- అంగవైకల్యం 50 శాతం ఉన్నవారికి పింఛన్లు ఇవ్వాలి
- పింఛన్లు రద్దు చేసిన వికలాంగుల అందరికీ పునర్ధరించాలి
- సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: వికలాంగుల పెన్షన్ రద్దు చేసిన వారందరికీ పునరుద్ధరించాలని సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌కి వినత పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జల్లా విశ్వనాథ్ మాట్లాడుతూ పునరుద్ధరణ పేరుతో వికలాంగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వ హాస్పిటల్‌లో సదరం సర్టిఫికెట్ లో పర్సంటేజ్ తగ్గిస్తూ, పూర్తి అంగవైకల్యం ఉన్న వారికి పింఛన్లు నిలిపివేస్తున్నారని వాపోయారు. వికలాంగుల ప్రతిరోజు వందలాదిమంది సచివాలయాలు, కలెక్టర్ కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. తిరుపతి నగరంలోని వందలాదిమంది వికలాంగులకు పింఛన్లు రద్దు చేశారని, వికలాంగులకు అన్ని అర్హతలు ఉన్న సచివాలయంలో అప్లై చేస్తుంటే అనర్హులుగా గుర్తిస్తున్నారని అన్నారు. పింఛన్లు రద్దు చేసిన వికలాంగులు ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది విచారణ జరిపి వారు అర్హుల కాదా నిజ నిర్ధారణ చేసి వారికందరికీ పింఛన్లు ఇవ్వాలని కోరారు. కొంతమంది వికలాంగులకు పర్సంటేజ్ తక్కువ ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని అనేక నిబంధనలతో వికలాంగులను హింసిస్తూ పింఛన్లు కట్ చేస్తున్నారని అన్నారు. తక్షణమే అర్హులైన వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ స్పందిస్తూ ఐదు రోజుల సచివాలయ సిబ్బంది పింఛన్లు రద్దయిన వికలాంగుల అందరూ ఇళ్లకు వెళ్లి విచారణ జరిపి తిరిగి అప్లై చేయించి అందరికీ పింఛన్లు మంజూరయ్యే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్‌డి రవి, పద్మనాభ రెడ్డి, జింక నాగరాజు, మహేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

నిలిపివేసిన వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్

విశాలాంధ్ర-గూడూరు: నిలిపివేసిన వికలాంగుల పెన్షన్లు ను పునరుద్ధరించాలని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద సీపీఐ గూడూరు నియోజకవర్గ సమితి ఆద్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లను పలు రకాల కారణాలతో తిరుపతి జిల్లాలో సుమారు 33 వేల మంది పెన్షన్లను రద్దు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలను కుదించేందుకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పెన్షన్ లు తీసుకుంటున్న వికలాంగులకు పెన్షన్ రద్దు చేయడం బాధాకరమన్నారు. ఇకనైనా ప్రభుత్వం నిలిపివేసిన వికలాంగుల పెన్షన్ లను మంజూరు చేయకపోతే సీపీఐ ఆద్వర్యంలో ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజవర్గ అధ్యక్ష కార్యదర్శులు సివిఆర్ కుమార్, నారాయణ, వెంకటయ్య, సుబ్రమణ్యం, నాగార్జున, వెంకీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన పింఛన్లను పునర్ధరించకుంటే ఉద్యమం తప్పదు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొలగించిన వికలాంగుల పెన్షన్లను వెంటనే పునరుద్ధరించకుంటే ఉద్యమం తప్పదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్‌కూడలి వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పైన కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేసి పెన్షన్ తొలగించడం దుర్మార్గమన్నారు. గతంలో టిడిపి హయాంలో ఇస్తున్న పెన్షన్లు కూడా తీసివేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించుకుని వికలాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులతో ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, పట్టణ నాయకులు మురళి జనార్ధన్, మునిరాజా, మహిళా సంఘం నాయకులు మునెమ్మ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పర్యవేక్షణలో డ్వామా పిడి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ఉపాధి హామీ కేంద్రంను డ్వామ పిడి ఏ.రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగినది. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగినటువంటి సర్వసభ్య సమావేశంలో కరువు పనులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వార్తాపత్రికలలో వచ్చిన కథనాలకు స్పందనగా డ్వామా పీడి తమశాఖ మండల స్థాయి అధికారులను కలవడం జరిగినది. అనేకమంది పంచాయతీ స్థాయి నాయకులు కరువు పనులు సక్రమంగా జరగట్లేదని, అందరికీ పని కల్పించడం లేదని, నిరాధారమైన బిల్లులను పెట్టి సొమ్ము చేసుకుంటున్నారని, ఒకరి ఫోటో పెట్టి ఇంకొకరు బిల్లులు తీసుకుంటున్నారని, పెట్టినటువంటి ఫిర్యాదులో భాగంగానే పిడి వచ్చినట్లు తెలుస్తున్నది.

సర్వేల పేరుతో వికలాంగుల పెన్షన్ తొలగించరాదు

సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు

విశాలాంధ్ర-చంద్రగిరి: సర్వేల పేరుతో వికలాంగుల పింఛను తొలగించరాదని సిపిఐ మండల కార్యదర్శి ఎన్.శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఉదయం చంద్రగిరి స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో వికలాంగుల పెన్షన్ విషయమై స్థానిక ఎమ్మెల్యే నాని ఎమ్మార్వో ఆఫీస్ కి రావడంతో ఎమ్మెల్యే కి వికలాంగులు పెన్షన్ ఎందుకు తొలగించారని చెప్పడంతో ఎమ్మెల్యే పై అధికారులతో నేను మాట్లాడాను వెంటనే వచ్చే నెలలకు అర్హులైన వికలాంగులకు, వృద్ధులకి, ఒంటరి మహిళలకు, పెన్షన్ వచ్చేలాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎమ్మార్వోకి వికలాంగుల పెన్షన్ విషయమై వినతి పత్రం అందించగా పై అధికారులతో చర్చలు జరిపి అందరికీ న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. ఈ మధ్యకాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగుల సర్వేల పేరుతో అందర్నీ ఒక చోటకు రమ్మని వారికి పెన్షన్ రాకుండా నిలిపివేయడం జరిగింది. వికలాంగులు వృద్ధులు ఒంటరి మహిళలు పెన్షన్ కోసం వేచి చూసి ఒకటో తేదీ మీకు పెన్షన్ తొలగించినారని అధికారులు తెలియ చేయడంతో వారు ఆవేదనకు గురవడం జరిగింది. వాళ్ళందరూ గ్రామపంచాయతీ అధికారులని కలెక్టర్ ఆఫీసుల్లో వద్ద పెద్ద ఎత్తున వికలాంగుల అందరూ ధర్నా చేయడం జరిగింది. వేలాదిమందికి పెన్షన్ తొలగించడం అనేది చాలా దురదృష్టకరం, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి వెంటనే వీటి పైన చర్చలు జరిపి వికలాంగులకు అందరికీ పెన్షన్ వచ్చేలాగా వారి జీవనాధారం అదే కాబట్టి వెంటనే వాళ్లకు పెన్షన్ సెప్టెంబర్ ఒకటో తేదీ అందరికీ పెన్షన్ ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో వికలాంగులను వృద్ధులను ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవై రాజా వాణి మునిరత్నం నాయుడు పాల్గొన్నారు.

రద్దయిన వికలాంగులకు పింఛన్లు వెంటనే ఇవ్వాలి

- సి.పి.ఐ డిమాండ్

విశాలాంధ్ర-సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 30 వేల వికలాంగుల ఇతర పెన్షన్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రజల శ్రేయస్సు నా అభిమతమని ప్రజలను ఉద్ధరించడానికి మేము పుట్టామని ఎన్ని ప్రగల్భాల్ పలికిన ఆచరణలో అది జరగడం లేదని గతంలో తీసుకుంటున్న 30 వేల మంది పెన్షన్ దారులకు ఈ ప్రభుత్వం నిలిపివేయడం చాలా దుర్మార్గమైన చర్య అని చిన్ని రాజు అన్నారు. వాస్తవంగా వాళ్ళందరూ అనర్హులైతే వారందరికీ ఇంతకాలం ఇచ్చిన పెన్షన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే కదా నడుస్తున్నది ప్రభుత్వ యంత్రాంగ పరిపాలన లేక పిడల్ రాజరికమా అని చిన్ని రాజ్ ప్రశ్నించారు. ఇలాంటి విషయాలపై ఎన్ఫోర్స్మెంట్ లేదా సిబిఐ లాంటి స్వతంత్ర సంస్థలు స్వచ్ఛందంగా జోక్యం చేసుకొని వాస్తవాలు నిగ్గు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. 30 వేల పెన్షన్లు రద్దు చేయడం ఇంత దారుణమని ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఓట్లు వేసి తమను సక్రమమైన పద్ధతుల పరిపాలించమని కోరితే ప్రజాప్రతినిధులైన రాజకీయ నాయకులు కార్యనిర్వాహకులైన ప్రభుత్వ అధికార యంత్రాంగం ఇలా దుర్వినియోగం చేయడం ఎంతవరకు సబబని ఇలాగైతే ఈ ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కాలంలో ఈ పద్ధతులు మార్చుకోకపోతే కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని రద్దయిన పెన్షన్లు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పోన్నేరు బాల గురునాథం. సత్యవేడు నియోజకవర్గం ఏఐటీయూసీ నాయకులు చంద్ర సిపిఐ మండల కార్యదర్శి నాపా కృష్ణమూర్తి. ఏఐవైఎఫ్ నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రద్దు చేసిన పింఛన్లు కొనసాగించాలి: సిపిఐ



విశాలాంధ్ర-పుత్తూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది ఇందులో భాగంగా పుత్తూరు అంబేద్కర్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం సాగింది. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకృష్ణ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం పోయి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం పోయి వికలాంగుల నూరు కొట్టే విధంగా రాష్ట్రంలో 30 వేల మంది వికలాంగుల పెన్షన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని వెంటనే వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటిని అమలు చేయాలని లేని పక్షంలో రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలకు భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీకారం చుడుతుందని ఆయన హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలతో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ఆశలు పెట్టుకున్నారని ఆ ఆశలను అది ఆశలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం నేడు అనుసరిస్తుందని అసలు వికలాంగులకి మరింత సహాయం మరింత అందవలసిన ప్రభుత్వం వారిపై ఈ రాష్ట్రంలో 30 వేల మంది పింఛన్లు రద్దు చేయడం చాలా దుర్మార్గమని అర్హులైన అందరినీ వెంటనే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి పుత్తూరు ప్రాంతం కార్యదర్శి మహేష్ ఏఐటియుసి నాయకులు చంద్రబాబు గోపి శరవణ కృష్ణారెడ్డి రమేష్ రమణ వెంకటరత్నం సల్వా రాజా చారి బాబు తదితరులు పాల్గొన్నారు.

పురపాలక కమిషనర్‌కు సత్కారం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పురపాలకసంఘ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన భవానీ ప్రసాద్‌ను టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్, టీడీపీ 32వ వార్డు ఇన్‌ఛార్జి పోలారు శ్రీనివాసులురెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయను దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా పురపాలకసంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆయనను కోరారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఆయా పరిధిలో ఉన్న నాయకులు, ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ యువత నాయకుడు అద్దంకి కిట్టు, బూత్‌కన్వీనర్ ఎస్‌కే షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని గ్రామాలలో వినాయక విగ్రహాలను పెట్టుకోవాలంటే తప్పనిసరిగా ఆన్లైన్లో అనుమతులు తీసుకోవాలని పెనుమూరు ఎస్సై వెంకట నరసింహం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో వినాయకుని యొక్క విగ్రహాలు పెట్టుకోవాలంటే తప్పనిసరిగా ఎటువంటి రుసుము లేకుండా ఆన్లైన్లో అనుమతులు తీసుకొని పెట్టుకోవచ్చునన్నారు. అనుమతులులేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు. భారతదేశ సాంకేతిక విప్లవానికి అధ్యుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం పలు సంస్కరణలు కూడా చేశారన్నారు. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం, నాగరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-గంగవరం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డాక్టర్ జె శ్రీనివాసులు తమ యొక్క పరిధిలో గల తొమ్మిది సచివాలయం నందు ఉన్న 13,862 మంది పిల్లలకు ఈనెల 12వ తేదీన జరిగిన కార్యక్రమం నందు 1325 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మిగిలిన 537 మందికి ఈరోజు మాత్రలను పంపిణీ చేసి నూరు శాతం పూర్తి చేశామని తెలిపారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమ ప్రతిష్టకు అనుమతులు తప్పనిసరి

- మంటపాల వద్ద డీజే మ్యూజిక్ ఏర్పాటు నిషేధం
- అనుమతులకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- కార్వేటి నగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంతప్ప హెచ్చరిక

విశాలాంధ్ర-వెదురుకుప్పం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామవీధుల్లో వినాయక ప్రతిమ ఏర్పాటుకు పోలీసు శాఖ నుండి అనుమతులు తప్పనిసరి అని కార్వేటి నగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ యస్. హనుమంతప్ప తెలిపారు. బుధవారం ఉదయం సీఐ హనుమంతప్ప మీడియా తో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వినాయక ప్రతిమ ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలీస్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. అలాగే వినాయక మండపాల వద్ద డిజె మ్యూజిక్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిందని, ఎవ్వరూ డీజే మ్యూజిక్‌ను పెట్టేందుకు అనుమతి లేదని వివరించారు. పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోబడుతుందని ఆయన హెచ్చరించారు. వినాయక ప్రతిమలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొంది, ఆరోగ్యకరమైన వాతావరణంలో పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖకు సహకరించాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి ఎటువంటి అవాంతరాలు లేకుండా నిర్వహించుకోవాలన్నారు.

పాల దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు సీజ్

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట లోని ఇండియన్ బ్యాంక్ వద్దగల తిరుమల డైరీ షాప్ లో ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి, ప్లాస్టిక్ వాడుతున్నందుకు ఆ షాపు యాజమాన్యానికి ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజుల్లా తెలియజేశారు. నాయుడుపేటలోని పలు షాపులలో రైడ్ చేయడం జరిగిందని షాపులలో ప్లాస్టిక్ కవర్లు వాడడం షాప్ కు వచ్చిన కస్టమర్లకు వాటిని అందజేయడం సరికాదని ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న షాపులను వాటి లైసెన్సులను రద్దు చేసే పరిస్థితి షాపు యాజమాన్యాలు తీసుకురావద్దని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్.ఫజుల్లా తెలియజేశారు.

అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-రామకుప్పం: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీలో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి తెలుగు దేశం పార్టీ నాయకులు అధికారులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ సచివాలయం ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో అన్న క్యాంటీన్ పక్కా భవనం లేకపోవడంతో అద్దె రేకుల షెడ్డులో రోజు మధ్యాహ్న భోజనాలు. పెడ్తున్నారని పక్కా భవన నిర్మాణంతో పేదలకు నీడ ఉండి ఆకలి తీర్చేందుకు పక్కాభవనం ఏర్పాటుకు పూనుకున్నామని పేర్కొన్నారు అదేవిధంగా త్వరగా నిర్మాణ పనులు చేపట్టి అన్నా క్యాంటీన్ ప్రారంభించాలని పేద ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరాజు, ఎంపీడీవో లక్ష్మి కాంత్, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, చిన్నికృష్ణ, చలపతి, సీతాపతి, రామ్మూర్తి, మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో దరఖాస్తులకు ఆహ్వానం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు ప్రభుత్వ డి.ఎల్.టి.సి/ ఐ.టి.ఐ. గూడూరు నందు 2025-2026 విద్యా సంవత్సరం నకు గాను సైంటిఫిక్ గ్లాసు నియాన్ సైన్ ట్రేడ్ నందు ఖాళీ అయిన సీట్లుభర్తీ చేయుటకు ధరఖాస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ (ఎఫ్.ఏ.సి) వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు http://iti.nic.in అనే వెబ్సైట్‌లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ: 26-08-2025 దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తేదీ: 29-08-2025 నాడు గూడూరు ప్రభుత్వ డి.ఎల్.టి.సి./ఐ.టి.ఐ నందు వారి యొక్క ఒరిజినల్ సర్టిఫికెటీసుకొని వచ్చి వెరిఫికేషన్‌కు రావాలని పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత వసతితో కూడిన జర్మన్ భాష ట్రైనింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: జీఎన్ఎమ్, బీఎస్సీ అర్హత కలిగిన అనుభవం గల ఎస్సీ, ఎస్టీ మహిళ అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యంతో కూడిన జర్మన్ భాషా ట్రైనింగ్ ప్రోగ్రాం ఈ నెల 22న తిరుపతిలో ప్రారంభం కానుందని తిరుపతి జిల్లా ఎస్సి సంక్షేమ, సాధికారిత అధికారి జె. విక్రం కుమార్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, స్కిల్ డెవలప్మెంట్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోల బాలా వీరాంజనేయ స్వామి హాజరవుతున్నారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమశాఖ సంచాలకులు బి.లావణ్యా వేణి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని, ఈ శిక్షణలో భాగంగా 25 మంది ఎస్సీ మహిళలు, 25 మంది ఎస్టీ మహిళలు ఎంపిక కాబడి, వారికి ఉచిత వసతి సౌకర్యం కల్పించబడుతుందని, జర్మన్ భాషా ట్రైనింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించుకునే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగకరమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం తిరుపతిలోని శ్రీ బాబు జగజీవన్ భవనంలో, మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో తెలియజేశారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు చిత్తు అవుతున్నాయని రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మత్తు పదా ర్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ నేటియువతరంలో చాలా మంది మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చిన్నతనంలోనే ప్రాణాలు కోల్పోవడం, మతిస్థిమితం లేకుండా చేయరాని తప్పులుచేసి నేరస్తులుగా మారుతున్నారన్నారు. విద్యార్థి దశలోనే తమ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, ఏఐఎస్ఎఫ్ నాయకులు అభి. వార్డెన్ సుమన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో విద్యార్థికి రూ.18 లక్షల ప్యాకేజ్

చిత్తూరులో ఘనంగా ప్రారంభమైన 'అధ్యాయ ఫేజ్-2'

ఫ్రెషర్స్‌కు స్వాగతం పలికిన వీసీ డా. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొ. ఎం.పోతరాజు

విశాలాంధ్ర-చిత్తూరు: ది అపోలో యూనివర్సిటీలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ "అధ్యాయ ఫేస్-2" బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ డా. హెచ్.వినోద్ భట్ మాట్లాడుతూ అపోలో యూనివర్సిటీ విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను విస్తరించే దిశగా నిరంతరం కృషి జరుగుతోందని ఆయన వివరించారు. అపోలో యూనివర్సిటీని దేశంలోనే అత్యుత్తమ సంస్థగా నిలబెట్టి, చిత్తూరుకు గిఫ్ట్‌గా ఇచ్చిన డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి దూరదృష్టి ఫలితమే నేడు మనం చూస్తున్న ప్రగతి" అన్నారు. 42 ఏళ్ల అపోలో జర్నీలో హెల్త్‌కేర్ రంగంలో అనేక మైలురాళ్లను అధిగమించిన విషయాన్ని గుర్తుచేశారు. క్లినికల్ మెడిసిన్‌లో మల్టిపుల్ స్పెషలైజేషన్‌లకు అవకాశాలు పెరిగాయని, అపోలో విద్యార్థులు ఈ రంగంలో దేశ విదేశాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అతిథి పీపుల్ అండ్ కల్చర్ ఇన్నోవేషన్ హెడ్ డాక్టర్ లవనం అంబాల మాట్లాడుతూ తాను దేశంలో అనేక యూనివర్సిటీలు చూశానని, అపోలో యూనివర్సిటీలోని నాణ్యతా ప్రమాణాలు ప్రాక్టికల్ ఎడ్యుకేషన్ ఎక్కడా కనిపించలేదని అన్నారు. అందుకే అపోలో యూనివర్సిటీ తొలి బ్యాచ్ విద్యార్థులు 18 లక్షల రూపాయల ప్యాకేజీ అందుకున్నారు" అని అభినందించారు. హెల్త్‌కేర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మేనేజ్మెంట్, హెల్త్ డేటా కేర్, ఫిజియోథెరపీ వంటి విభాగాల్లో విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందిస్తున్న అపోలో కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ డా. కె. భాస్కర్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ జగదీషన్, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డీన్ రామయ్య ఇటుమల్ల, అకాడెమిక్ డిప్యూటీ డైరెక్టర్ డా. వివేకానందన్, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాధిపతి డా. సుచరిత, పలువురు విభాగాధిపతులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరంలోని శిష్ట సౌందర్య వల్లి సదాశివేశ్వర స్వామి ఆలయము నందు ప్రదోక్షవ బుధవారం పూజ అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా నందీశ్వరునికి, మూల విరాట్ కు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి భక్తులు హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కోదండ పని మొదలి, వివిధ గ్రామాల నుండి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పిజిఆరెస్ అర్జీలకు పరిష్కారం చూపాలని జెడ్పి సీఈఓ వెంకట నారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ఫిర్యాదులని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం దరఖాస్తులకు నిర్దేశిత సమయం లోపు సమాచారం అందించాలన్నారు. అన్నీ గ్రామ పంచాయతీల్లో ప్రతిరోజు ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పురుషోత్తం, ఏఓ నాగమణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన పవిత్రోత్సవాలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరంలోనే శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారంతో వైభవంగా ముగిసింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారిని సుప్రభాతంతో మేల్కొల్పి తోమాల సేవ, సహస్రనామార్చన, టిటిడి అర్చకులచే నిర్వహించారు. అనంతరం వేద ఘోష మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల మూలవరులకు, ఉత్సవమూర్తులకు, గరు డాళ్వారులకు, పరివార దేవతలకు, పవిత్ర మాలలు సమర్పించారు. సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాలకు తిరు వీధి ఉత్సవం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్ర ఉత్సవాలు ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈఓ రవి, ఆలయ అధికారి సురేష్ కుమార్, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని సివిసి పార్క్ వద్ద ఉన్న ప్రసాదు ట్రేడర్స్ ముందు ఒక గుర్తు తెలియని సుమారు 45-50 సంవత్సరాలు వయసుగల మగ వ్యక్తి మృత దేహం లభ్యమైంది.గూడూరు ఒకటవ పట్టణ ఎస్.ఐ. తిరుపతయ్య కథనం మేరకు మృతుని గురించి ఆరా తీయగా అతనికి సంబంధించిన వారు ఎవరు లేరని అతను గత కొంతకాలంగా పట్టణంలో చిత్తు కాగితాలు, ఖాళీ వాటర్ బాటిల్స్ ఏరుకొని ఇనుప సామాను అంగళ్లలో వేసి వచ్చిన డబ్బుతో మద్యం సేవిస్తూ ఎక్కడపడితే అక్కడ పండుకొని నిద్ర పోయేవాడిని విచారణలో తేలిందన్నారు. అతని ఆచూకీ తెలిసిన యెడల గూడూరు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9490413803, మరియు సబ్ ఇన్స్పెక్టర్ ఫోన్ నెంబర్ 9440796342 కు తెలియజేయవలసిందిగా పేర్కొన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చంద్రగిరి అభివృద్ధికి మరో ముందడుగు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి అభివృద్ధికి ఎంఎల్ఏ నాని మరో ముందడుగు వేశారు. బుధవారం చంద్రగిరి లో నాని విస్తృతంగా పర్యటించారు. చంద్రగిరి పట్టణంలో అధికారులతో కలిసి బీసీ, ఎస్సీ హాస్టల్ కు స్థలం పరిశీలించారు. బాలికల హాస్టల్ వద్ద శుభ్రత లేకపోవడంతో సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసారు. హాస్టల్లో శుభ్రత లేకపోతే విద్యార్థులు అంటు వ్యాధుల వలన ఇబ్బంది పడతారని తక్షణమే శుభ్రత చేయించి బ్లీచింగ్ వేయాలని హాస్టల్ వార్డెన్లు ఆదేశించారు. చంద్రగిరి పట్టణంలో ఆక్రమనకు గురైన స్థలాలను, కాలవలను గుర్తించాలని మండల రెవిన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. చంద్రగిరి బాలుర పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు తెలిపారు. చంద్రగిరి పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో అసంపూర్తిగా నిలిచిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి అసంపూర్తిగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం పనులను త్వరగా పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులకు తెలిపారు. అనంతరం చంద్రగిరి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన అర్జీలను ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. చంద్రగిరి మండలంలో సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని కోరిన ఎమ్మెల్యే.కూటమి ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ దోమల దినోత్సవం - అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. శైలజ లాటో అధ్యక్షతన, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జి.కే.రూప్‌కుమార్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ లాటో మాట్లాడుతూ, ఆరోగ్య భద్రత అనే సంకల్పంతో దోమలు లేని గ్రామాలు, దోమలు లేని నగరాల నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ (శ్రీనివాసులు రెడ్డి (డీసీఎస్), డాక్టర్ మురళీకృష్ణ (డీఎస్ఓ), డాక్టర్ రెడ్డి ప్రసాదు (పీఓ), డాక్టర్ మధు, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, డిఎంహెచ్ఓ సిబ్బంది, ఎస్‌యు ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన సూత్రధారులను గుర్తించాలి

విశాలాంధ్ర-సత్యవేడు: నకిలీ రెవిన్యూ ధ్రువపత్రాలను సృష్టించిన సూత్రధారులను గుర్తించాలంటూ కెవిపిఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం, సిపిఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో బాధితులు పలువురు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అరుణాచలం మాట్లాడుతూ నకిలీ రెవెన్యూ ధృవపత్రాలతో అమాయక ప్రజల భూములను రిజిస్టర్ చేసుకొని వారిని కోటి చుట్టూ చెపుతున్న మోసగాళ్లను వెంటనే అరెస్టు చేయాలన్నారు. సత్యవేడు మండలం పేరడం గ్రామంలోని మదికి పూర్వికంగా సంక్రమించిన సొంత భూమి ఉందన్నారు. అయితే శిరణంబూదూరు గ్రామానికి చెందిన కుమార్ నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్టు ఆయన ఆరోపించారు. దీంతో అటు రెవెన్యూ అధికారులను ఇటు రిజిస్ట్రేషన్ అధికారులను బోల్తా కొట్టించారన్నారు. పైగా నకిలీ ధ్రువ పత్రాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న కుమార్ ప్రస్తుతం భూ హక్కుదారులపైనే కోర్టులో కేసు వేశారన్నారు. రెవెన్యూలో సమాచార హక్కు చట్టం ద్వారా నకిలీ ధ్రువపత్రం బయటపడింది అన్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత వీఆర్వో దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. అయితే దీనిపై కేసు నమోదు జాప్యం నెలకొనడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చింది అన్నారు. సిపిఎం నాయకులు రమేష్ మాట్లాడుతూ తక్షణమే పోలీస్ అధికారులు కుమార్పై కేసు నమోదు చేసి అరస్టు చేసి చట్టపరంగా శిక్షించాలి అని డిమాండ్ చేశారు. అయితే దీనిపై ఎస్ఐ రామస్వామి వెంటనే స్పందించారు. వీఆర్వో ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. నకిలీ ధ్రువపత్రాలు,రబ్బర్ స్టాంపులు వంటి వాటిపై లోతైన దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామస్వామి బాధితులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మురళి, కిష్టయ్య, మునస్వామి, అమ్ములు రోస్లిన్, మది, సుశీల, కొల్లాపురి, వీరమ్మ, లక్ష్మీ, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర-రామకుప్పం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అలింకో సంస్థ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూడు చక్రాల సైకిళ్లకోసం దరఖాస్తు చేస్తున్న రామకుప్పం మరియు శాంతిపురం మండలాలకు చెందిన 1465 మంది దివ్యాంగులకు ఉచితంగా అందజేశారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు మాజీ మండల అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అన్ని విధాల ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గతంలో గృహ నిర్మాణ శాఖ ద్వారా మండల పరిధిలో ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న సుమారు 87 మంది లబ్ధిదారులకు సీలింగ్ ఫ్యాన్లను తదితరాలను అందజేశారు కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, మాజీ వైస్ ఎంపీపీ భార్గవి చిన్నికృష్ణ, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చలపతి, సీతాపతి, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, మహ్మద్ రఫీ, సుబ్రి, బాలు, మంజునాథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, తహసీల్దార్ కౌలేష్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ ఐటిఐలో ప్రవేశాలకు మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26 తేదీ లోగా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సమీప ప్రైవేట్ ప్రభుత్వ ఐటిఐ లను సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి కాల్ లెటర్లు పంపడం జరగదని, అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రౌడీయిజాన్ని ఎన్‌డిఏ ఉపేక్షించదు

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: రౌడీయిజాన్ని ఎన్డిఏ ఉపేక్షించదు అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత ఖైదు అనుభవిస్తున్న అవిలేల శ్రీకాంత్ పెరోలుకి నేను ఇచ్చిన సిఫార్సు లెటర్ ప్రభుత్వం రిజెక్ట్ చేసిందన్నారు. గూడూరు ఎమ్మెల్యేగా నేను ఇచ్చిన లెటర్ తో శ్రీకాంత్ కి పెరోలు ఇవ్వలేదు అని పేర్కొన్నారు. శ్రీకాంత్ తల్లి ఆరోగ్యం సరిలేదని గ్రీవెన్స్ లో నాకు అర్జీ ఇవ్వడంతో లెటర్ ఇచ్చానే తప్ప వేరే ఆలోచనతో ఇవ్వలేదన్నారు. పేదప్రజలు వచ్చి కష్టాలు చెప్పుకుంటే మనసు చలించి లెటర్స్ ఇస్తానే తప్ప వేరే ఉద్దేశ్యం లేదు అని తెలిపారు. పెరోలు ఎవరు సిఫార్సుచేస్తే ఇచ్చారో ప్రభుత్వం విచారణ చేపడుతుందనీ తెలిపారు తప్పు చేసిన వారిపై కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలని నాపై ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర రాజు, నెలబల్లి భాస్కర్ రెడ్డి, చిన్న వై.ఎస్సార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-పెనుమూరు: మండలంలోని సోమిరెడ్డిపల్లి పంచాయతీ గ్రామంలో ఉన్నటువంటి చెత్త కేంద్రాలను డి ఎల్‌డివో రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఉగ్రసం పల్లి జట్టుగుండ్లపల్లి సామిరెడ్డిపల్లి గ్రామాలలో పర్యటించి చెత్త సేకరణ ఏ విధంగా చేస్తున్నారనే దానిమీద ఆరా తీశారు అనంతరం సోమిరెడ్డిపల్లి పంచాయతీలో ఉన్నటువంటి చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సింగల్ విండ్ పద్ధతిలో వినాయక మండపాలకు అనుమతి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: తుడా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వినాయక మహోత్సవ కమిటీ కార్యాలయాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. వీధుల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే వాళ్ళు మహోత్సవ కమిటీని సంప్రదించి అనుమతులు పొందాలని ఆయన కోరారు. ఈ నెల 27వ తేదీ జరిగే వినాయక చవితిని సాంప్రదాయబద్ధంగా చేసుకోవాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కృషి చేస్తున్నారని ఆయన చెబుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో చేసిన వినియాక విగ్రహాల స్థానంలో మట్టితో చేసిన విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల 31 వ తేదీ నిమజ్జనం చేయాలని నిర్ణయించినందున ప్రజలంతా ఆ రోజు కేటాయించిన సమయం ప్రకారం మండపాల నుంచి విగ్రహాలను వినాయక సాగర్‌కు తరలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారయంత్రాంగం చేస్తోందని ఆయన తెలిపారు. ప్రజలు నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. వినాయక మండపాల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి కాల్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమీషనర్ మౌర్య తెలిపారు. ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా ఈ కాల్ సెంటర్ కు తెలిపితే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు ఉచితంగా ఇస్తామని ఆమె తెలిపారు. గత ఏడాది ఐదు వందల అప్లికేషన్లు వచ్చినట్లు ఆమె చెప్పారు. ప్రజలు ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా విగ్రహ మండపాల ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిమజ్జనానికి సహకరించాలని ఆమె కోరారు. పర్యావరణ హితమైన విగ్రహాలను ప్రజలు పూజించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్ అన్నా అనిత, నవీన్ కుమార్ రెడ్డి, రాజా రెడ్డి, గుండాల గోపి తదితరులు పాల్గొన్నారు.

జానపద గేయాలపై అవగాహన

విశాలాంధ్ర-రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో మన సంస్కృతి కళామండలి సంస్థ వ్యవస్థాపకులు రెడ్డప్ప సహకారంతో బుధవారం జానపద గేయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత మాట్లాడుతూ పల్లె ప్రజల జీవన విధానాన్ని ఆచార వ్యవహారాలను ప్రతిబింబింప చేసేది జానపదాలని పేర్కొన్నారు. జానపద గేయాలు ఉప్పొంగే ఉత్సాహాన్ని అతిశయించే ఆనందాన్ని ఇస్తాయని తెలిపారు. అనంతరం మన సంస్కృతి కళామండలి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డప్ప అనేక జానపద గేయాలను పాడి విద్యార్థులందరినీ అలరించారు. విద్యార్థుల చేత జానపద గేయాలను పాడించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టిపి జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్, విశ్వనాథం, ఐ వెంకటరామయ్య, కృష్ణార్జున రెడ్డి, బ్రహ్మం, దిలీప్ కుమార్, శాంతి, లీలారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి టీవీలు విరాళం

విశాలాంధ్ర-పూతలపట్టు: వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయానికి సాంసంగ్ కంపెనీ 55" రెండు టీవీలు విరాళం సుమారు విలువ 1,20,000/- రూపాయలు, దాత - చిత్తూరు విమ్సన్ అధినేత రవీంద్రనాథ్, రమణ, వీరికి దర్శన ఏర్పాటు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసిన దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, ఏ.ఈ పవన్ తదితరులు ఉన్నారు.

ఢిల్లీ ఎర్రకోటలో అవార్డు తీసుకున్న సర్పంచ్ భాగ్యవతి

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ సర్పంచ్ భాగ్యవతి ఢిల్లీలో నిర్వహించిన 79 గణతంత్ర వేడుకల్లో అవార్డు తీసుకోవడం జిల్లాలో మొదటి వ్యక్తిగా పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో అభివృద్ధి కార్యక్రమాల్లో మొదటి స్థానాన్ని రావడం అంటే గొప్పతనం జలశక్తి అభియాన్ ప్రతినిధులచే అవార్డు తీసుకోవడం అంటే జిల్లాలో కుప్పం చౌడేపల్లి మండలాల్లో ఇద్దరు సర్పంచ్లకు మాత్రమే అవార్డులు అందించడం జరిగింది. గడ్డంవారిపల్లె ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్ భాగ్యవతి హరి దంపతులు శ్రమించి పంచాయతీని అభివృద్ధి పథంలో ముందు తీసుకోవడం వల్లనే అవార్డు సాధించారని గ్రామ ప్రజలు మండల ప్రజలు నాయకులు కొనియాడారు మండలంలోని వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డివైయస్సార్ పార్టీ అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి అధ్యక్షతన వైయస్సార్ పార్టీ ఉపాధ్యక్షుడు జంగాలపల్లి వెంకటరమణ సర్పంచ్ భాగ్యవతి హరి లకు సన్మానం అత్యంత వైభవంగా నిర్వహించారు ప్రపంచ చరిత్రలోనే పుంగనూరు నియోజకవర్గ చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ ఓ మైలురాయిగా నిలవడం అంటే గొప్ప విషయం ఈ కార్యక్రమంలో సర్పంచ్ల అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాజీ జెడ్పిటిసి సభ్యురాలు రుక్మిణమ్మ తెల్లనీలపల్లి రెడ్డప్ప రెడ్డి రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకటపతి బ్యాంకు రెడ్డప్ప సర్పంచులు కాగిత సర్పంచ్ సె మీషిర్ బాబు ఎంపిటిసి శ్రీరాములు పవన్ కుమార్ భాస్కర దుర్గ సముద్రం చెంగారెడ్డి దిగువపల్లి సర్పంచ్ సోనీ వెంకటరెడ్డి దాదేపల్లి వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు మండలంలోని ఎంపిటీసీలు సర్పంచులు వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సింగిల్ విండో ఛైర్‌పర్సన్‌గా కృష్ణమనేని సావిత్రి

విశాలాంధ్ర-పాకాల: పాకాల సింగిల్ విండో ఛైర్‌పర్సన్‌గా కృష్ణమనేని సావిత్రి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో సింగిల్ విండో ఛైర్‌పర్సన్‌గా సావిత్రి, డైరెక్టర్లుగా ఆనంద్, కిరణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సింగిల్ విండో ఛైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి రావడానికి కృషిచేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సింగిల్ విండో ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి మహిళ కావడం తనకు సంతోషంగా ఉందని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. పదవీ బాధ్యతలు చేపట్టిన ఆమెను పలువురు శాలువా కప్పి, పూలమాలవేసి సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నాగరాజు నాయుడు, ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ సి.ఈ.ఓ మురలి, మేనేజర్ చక్రవర్తి, ఫీల్డ్ ఆఫీసర్ దొరస్వామి లతోపాటు అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయితీతో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోండి

విశాలాంధ్ర-సత్యవేడు: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో రాయితీతో ఇండ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చునని సత్యవేడు స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్యప్రకాష్ చెప్పారు. ఇందులో భాగంగా ఒక కిలో వాట్ సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్ ఏర్పాటు కోసం ప్రభుత్వం 30 వేల రూపాయలు సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే 2 కిలోవాట్లకు 60 వేలు, 3 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు 78 వేల రూపాయలు సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యువజన పథకం కేవలం గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు గాను అవసరమైన రుణాన్ని భారతీయ స్టేట్ బ్యాంకు మంజూరు చేస్తుందన్నారు. పైగా 6.5 శాతం అతి తక్కువ వడ్డీతో స్టేట్ బ్యాంకులో రుణం పొందవచ్చును అన్నారు. మండలంలో గృహ విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇళ్లపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు సంబంధించి ఆసక్తి ఉన్న విద్యుత్ గృహ వినియోగదారులు సత్యవేడు ఎస్బిఐ శాఖను సంప్రదించాలన్నారు.

రైలు ఢీకొని టీటీడీ ఉద్యోగి మృతి

విశాలాంధ్ర - పుత్తూరు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలు ఢీకొని నాగలాపురంలోని.వేదనారాయణస్వామి ఆలయంలో నాదస్వర విద్వాన్గా పనిచేసే ఎం.శ్రావణ్కుమార్(31) మృతి చెందాడు. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలో నివాసం ఉండు శ్రావణ్ కుమార్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రైల్వే పోలీసులు పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

తాసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ తనిఖీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి మండల తహసీల్దారు కార్యాలయాన్ని పలమనేరు ఆర్డీవో భవాని బుధవారం తనిఖీ చేశారు. మండలంలో సమస్యలు పేరుకుపోయాయని, భూ సమస్యల వివాదాలు చౌడేపల్లి మండలం నుంచి అధిక సంఖ్యలో వస్తున్నాయని అన్నారు. రైతులు దాదాపు సంవత్సరం రోజులుగా ఆర్డీవో ఆఫీస్, కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరగడమే జరుగుతున్నదని, రైతుల సమస్యలు మండల తహసీల్దారు కార్యాలయంలో పట్టించుకోవడమే లేదన్నారు. రెవెన్యూ అధికారులు నిలకడగా మండలంలో పనిచేయక లేకపోవడం వల్ల బదిలీలపై వెళ్లటం వల్ల భూ సమస్యలు మొదటికి వచ్చాయి. కొత్తగా వచ్చిన రెవెన్యూ సిబ్బందికి పంచాయతీలపై పట్టు దొరకాలంటే దాదాపు ఆరు నెలలు పడుతుంది. అంతవరకు రైతులు ఎదురుచూడడం తప్ప పరిష్కారం జరిగేలా లేదు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరులోని మూడు కోర్టుల ఆవరణ లో సెప్టెంబర్ 13వ తారీకున జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. సి రాఘవేంద్ర మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీ మార్గములో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనము ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు దాని పై అప్పీల్ ఉండదని తెలిపారు ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చును అని రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చును అని ఈ లోక్ అదాలత్ లో ప్రీ లిటిగేషన్ కేసులను (కోర్టు లో పెండింగ్ లేని కేసులు)రాజీ చేస్తారు అని కక్షి దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలన్నారు. పోలీసులు, న్యాయ వాదులు లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు.

ఇన్నోవేషన్ ద్వారా భవిష్యత్తు సృష్టించండి

విశాలాంధ్ర-చిత్తూరు: ది అపోలో యూనివర్శిటీలో బుధవారం జరిగిన ఐడియాథాన్ - 2025 యూనివర్శిటీ స్థాయి ఐడియా థాన్ కార్యక్రమంలో విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. వ్యవసాయం, పశుపోషణ, బయోటెక్నాలజీ, సరఫరా శ్రేణి నిర్వహణ, కృత్రిమ మేధస్సు వంటి విభాగాలపై రూపొందించిన ప్రాజెక్టులు న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రాజెక్టుల విద్యార్థులకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ పోతరాజు మాట్లాడుతూ, ఇన్నోవేషన్ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో స్టార్టప్ల వైపు ముందడుగు వేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ కపిలా పథకాన్ని ఉపయోగించుకొని పేటెంట్ చేయాలనుకునే విద్యార్థులకు అవసరమైన మద్దతు, మార్గనిర్దేశనం అందిస్తామని చెప్పారు. అలాగే, విద్యార్థులు అభివృద్ధి చేసిన ఉత్పత్తులకు, కంపెనీ స్థాపించేందుకు యూనివర్శిటీ పూర్తి సహకారం అందిస్తుందని, అపోలో యూనివర్శిటీ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి కేంద్రంగా ముందుకు సాగుతుందని, ఇప్పటికే అనేక మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసి తమ సృజనాత్మక ఆలోచనలను వాస్తవ రూపంలో మార్చే దిశలో అడుగులు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని ఐసిసి కన్వీనర్ డా. కె.సుధీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు అందుబాటులోకి స్వామి పుష్కరిణి



విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఒక నెల ముందుగా నిర్వహించే స్వామివారి పుష్కరిణి మరమ్మతు పనులు పూర్తయి కొత్త హంగులతో తీర్చిదిద్దబడిన స్వామి పుష్కరిణి బుధవారం నుండి భక్తులకు అందుబాటులోకి వచ్చింది.కాగా ఈ మరమ్మతు పనులు టీటీడీ జూలై 20 తేదిన ప్రారంభించిన విషయం విదితమే. ఇందులో భాగంగా స్వామి పుష్కరిణిలోని పాత నీటిని తొలగించి, నీటి అడుగ భాగంలో పేరుకున్న ఇసుకను, పాచిని తొలగించడానికి వాటర్‌వర్క్స్ విభాగంలోని దాదాపు 100మంది కార్మికులు రేయింబవళ్లు కష్టపడి స్వామి పుష్కరిణి శుద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అంతేకాకుండా స్వామి పుష్కరిణి మెట్లకు ఆకర్షణీయమైన రంగులు (పెయింటింగ్) అద్దకంతో శోభాయమా నంగా తీర్చిదిద్దారు. దాదాపు కోటి లీటర్ల నీటితో స్వామి పుష్కరిణి నింపి మరమ్మతు పనులు పూర్తిచేశారు.అయితే స్వామి పుష్కరిణి మరమ్మతు పనుల నేపథ్యంలో ప్రతిరోజూ నిర్వహించే పష్కరిణి హారతిని టీటీడీ నిలిపివేసింది. అదే విధంగా భక్తులను కూడా ఒక నెల రోజులపాటు స్వామి పుష్కరిణిలోనికి అనుమతించలేదు. బుధవారం నుండి భక్తులను పుష్కరిణీలో అనుమతించారు.

పూర్ణాహుతితో ఘనంగా ముగిసిన సంగోపాంగ శ్రీ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: భక్తుల ఐశ్వర్యం, ఆయురారోగ్య సంపదలు కాంక్షిస్తూ తిరుమల ధర్మగిరిలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన సంగోపాంగ శ్రీ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం బుధవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ఘనంగా ముగిసింది.మొత్తం 32 మంది వేదపండితుల సమక్షంలో జరిగిన ఈ మహాయాగంలో వేదపారాయణం, సుందరకాండ పారాయణం తదితర వైదిక క్రతువులు జరిగాయి. ఈ యాగానికి హాజరైన టీటీడీ ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ సంగోపాంగ శ్రీ శ్రీనివాస విశ్వశాంతి మహాయాగం వైభవంగా ముగిసిందని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విశ్వశాంతి యాగాలు, హవనాలను నిర్వహించాలని టీటీడీ నిర్ణయం తీసుకుందని అన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాలు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ మహాయాగంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఎస్వీ వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

250 కోట్ల స్కాలర్షిప్పులతో 'అంథే 2025' తేదీలు ప్రకటించిన ఆకాష్

విశాలాంధ్ర - తిరుపతి : ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంథే 2025 పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 250 కోట్ల రూపాయలు విలువైన స్కాలర్షిప్లను ప్రకటిం చినట్టు ఇక్కడ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎయిర్ బైపాస్ రోడ్ లో గల సంస్థ కార్యాల యంలో స్టేట్ అకాడమిక్ ఆపరేషన్ హెడ్ ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి, రీజనల్ సేల్స్ హెడ్ నిశాంత్ మిశ్రా, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్, రీజినల్ మార్కెటింగ్ హెడ్ మోడేం నరసింహులు, బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం పోస్టర్ విడుదల అనంతరం విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 4 నుంచి 12 వరకు జరుగుతుంది. అంతే 2025 ను విజయవంతంగా 16వ ఏట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నూరు శాతం ఉచితంగా శిక్షణ పొందడంతో పాటు పలు క్యాష్ ప్రైస్ ప్రకటించినట్టు తెలిపారు. ఆంథే 2025 పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో అక్టబర్ 5, 12 తేదీల్లో వివిద కేంద్రాల్లో నిర్వహించబ డుతుంది. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులకు క్లాస్‌రూమ్, ఆకాష్ డిజిటల్ మరియు ఇన్‌విక్టస్ కోర్సుల కోసం స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడతాయి. గత ఏడాది, ఈ పరీక్షలో 10 లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం ద్వారా కొత్త రికార్డ్ స్థాపించ బడింది. నీట్ యుజి, జేఈఈ మెయిన్ మరియు అడ్వాన్స్ లో టాప్ ర్యాంకులలో ఉన్న విద్యార్థుల్లో చాలామంది ఆంథే ద్వారా తమ ప్రయాణాన్ని ప్రారంభించారుఈ అవకాశాన్ని 9 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నీట్, జేఈఈలలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న ఆకాష్ సంస్థ ద్వారా శిక్షణ పొందే వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కూడా తర్ఫీదు నిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్లైన్లో వెబ్సైట్ https://anthe.aakash.ac.in/home ఆఫ్ లైన్ పరీక్ష రాయాలనుకునే వారు సమీప ఆకాష్ కేంద్ర లో సంప్రదించవచ్చునని వెల్లడించారు. కార్యక్రమంలో సమస్త ప్రతినిధులు సాయి రాజ్, చిరంజీవి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం

- 55 సంవత్సరాలుగా ఉన్న సింహాచలం కండ్రిగ భూసమస్య పరిష్కారం
- మూడు నెలల్లో 90 కుటుంబాలకు అసైన్మెంట్ పట్టాలు ఇవ్వాలని నిర్ణయం
- రిజర్వ్ ఫారెస్ట్ లో పట్టాలు రద్దు చేసి, తిరిగి వేరే భూములను గుర్తించి ఇస్తాం
- వనసంరక్షణ సమితి ఏర్పాటుకు చర్యలు
- ఫారెస్ట్ ఇంక్రిమెంట్ స్కీమ్ ద్వారా ప్రతి కుటుంబానికి ఆదాయం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పేద ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడడమే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి మండలం ఇనగనూరు రెవెన్యు గ్రామంలోని సింహాచలం కండ్రిగ గ్రామస్తులతో భూ సమస్య పరిష్కారం కొరకు నిర్వహించిన సమావేశం లో స్థానిక ఎం.ఎల్.ఏ బొజ్జల వెంకట సుదీర్ రెడ్డి, డి.ఎఫ్ ఓ వివేక్, శ్రీ కాళహస్తి ఆర్.డి.ఓ భానుప్రకాష్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం ఇనగనూరు రెవెన్యూ గ్రామం సింహాచలం కండ్రిగ హ్యాబిటేషన్‌లో తరతరాలుగా వస్తున్నటువంటి భూసమస్య మీద తగు పరిష్కారం తీసుకురావడం కోసం శాసనసభ్యులు బొజ్జల సుదీర్ రెడ్డి, డిఎఫ్ఓతో కలిసి సింహా చలం కండ్రిగ గ్రామస్తులతో మాట్లాడి సమస్యను తెలుసుకొని, సమస్యను పరిష్కరిం చడం కోసం చర్చించడం జరిగి ందని తెలిపారు. సుమారుగా 55 సంవత్సరాల నుంచి ఈ భూ సమస్య ఉందని, 1970 లో వీరంద రికీ రిజర్వ్ ఫారెస్ట్ లో ముందుగా పట్టాలు ఇవ్వడం జరిగిందని, మళ్ళీ 1978 లోఅప్పుడున్నటువంటి కలెక్టర్ ఆ పట్టాలను క్యాన్సిల్ చేయడం జరిగిందని, మరొకసారి 1998లో 98 కుటుంబాలకు 130 ఎకరాలు పట్టాలు ఇవ్వడం జరిగిందని, కాలక్రమేణా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అవి క్యాన్సిల్ చేయమని 2008లో కలెక్టర్‌కి రాయడం జరిగిందని తెలిపారు. 2014 లో కూడా హైకోర్టు వాటిని రిజర్వ్ ఫారెస్ట్ భూమి అని గుర్తించడం జరిగిందన్నారు. కానీ ఈ పట్టాలు డికెటి పట్టాలు క్యాన్సిల్ అవ్వకపోవడం వలన ఇక్కడ తరచుగా అక్కడున్నటువంటి సింహాచలం కండ్రిగ గ్రామస్తులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మధ్య కూడా సమస్యలు వస్తూ ఉండేవని, దీనికి పరిష్కరించుట కోసం అక్కడున్నటువంటి బడుగు బలహీన వర్గానికి చెందినటువంటి ఎస్సీ కుటుంబాలకు న్యాయం చేయడం కోసం ఈరోజు ఎమ్మెల్యే నేను వారిని కలవడం జరిగిందని తెలిపారు. ఇన్ని రోజులు వాళ్ళ భూమి అనుకొని రిజర్వ్‌ఫారెస్ట్‌లో అప్పుడు 1998 లో ఇచ్చినటువంటి పట్టాని, అది రిజర్వ్ ఫారెస్ట్ గా గుర్తిస్తూ దాంట్లో వనసంరక్షణ సమితి (విఎస్ఎస్) పతాకాన్ని, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, గ్రామస్తుల ద్వారా ప్లాంటేషన్ చేయించి, దానినుండి వచ్చే ఆదా యాన్ని ప్రభుత్వం మరియు గ్రామస్తులు పంచుకునే విధంగా వనసంరక్షణ సమితిని ఏర్పాటు చేయాలని డిఎఫ్ఓ ని ఆదేశించడం జరిగిందని తెలిపారు. వారందరినీ గమనిస్తే ఎవరు కూడా సెంటు భూమి లేనటువంటి నిరుపేదలని, ఎం ఎల్ ఏ అభ్యర్ధన మేరకు ఈ 90 కుటుంబాలకు మూడు నెలలలోపు దగ్గరలో ఉన్న మంచి భూమిని గుర్తించి అసైన్మెంట్ పట్టాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ రెండు పరిష్కా ర మార్గాలకు ప్రజలు అంగీకరించి హర్షం వ్యక్తం చేయడం జరిగిందని తెలిపారు. సుమారు 5 దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం అందరు కలిసి పేదలకు సహాయం చేయా లనే ఉద్దేశంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ పరిష్కారం వల్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, అటవీ, రెవెన్యు, అధికారులు,స్థానిక నాయకులు, సింహాచలం కండ్రిగ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్లు చాంపియన్స్‌గా నిలవడం ఆనందంగా ఉంది

- సిడిసిఏ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్)
- అండర్ 23 సీనియర్ ఉమెన్స్ జట్టు, అండర్ 16 బాయ్స్ జట్లకు ఘన సన్మానం

విశాలాంధ్ర - తిరుపతి : 2025వ సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్లు అన్ని ఫార్మేట్ లలో ఛాంపియన్స్ గా నిలవడం ఆనందంగా ఉందని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన ఇంటర్ డిస్టిక్ క్రికెట్ టోర్నీలో అండర్ 16 బాయ్స్ జట్టు అదేవిధంగా అనంతపురం ఆర్ డి టి స్టేడియంలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్స్‌గా నిలిచిన అండర్ 23,సీనియర్స్ ఉమెన్స్ జట్లను చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) మాట్లాడుతూ సరైన గ్రౌండ్స్ గాని, ప్రాక్టీస్ నెట్స్ గాని లేకపోయినప్పటికీ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ సంవత్సరం అన్ని ఫార్మేట్లలోను జిల్లా క్రికెట్ జట్టు విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. అండర్ 15 ఉమెన్స్, అండర్ 16 బాయ్స్, అండర్ 19 బాయ్స్, అండర్ 23 బాయ్స్, సీనియర్ బాయ్స్, అండర్ 23, సీనియర్ గర్ల్స్ ఇలా అన్ని ఫార్మాట్‌లలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు విజయం సాధించిందని తెలిపారు. జిల్లా క్రికెట్ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా మొట్టమొదటిసారి అన్ని ఫార్మాట్‌లలో విజయం సాధించడం ఇదే మొదటిదని ఆయన పేర్కొన్నారు. ముందు ముందు ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు సిడిసిఏ సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజేత జట్లకు, సౌత్ జోన్ కు ఎన్నికైన క్రికెటర్లకు, కోచ్ అనిత, సెలెక్టర్ వేదవల్లి అదేవిధంగా బాయ్స్ క్రికెట్ జట్టు కోచ్, సెలక్టర్లను జిల్లా అసోసియేషన్ అభినందనలు తెలియజేసి, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి,కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్, దివాకర్, రవి, మార్కండేయులు, సత్య శ్రీనివాస్, గాలి వేణుగోపాల్ నాయుడు, శివప్రసాద్, రమణ, ప్రకాష్, కోచ్ లు సునీల్, చిన్నబాబు, అనిత, చంద్రిక, సీనియర్ క్రికెటర్ అంపైర్ సుదర్శన్, చిత్తూరు సీనియర్ క్రికెటర్ జాకీర్, అండర్ 23 సీనియర్స్ ఉమెన్స్ జట్టు,అండర్16 బాయ్స్ జట్టు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్

ఈనెల 24, 25, 26వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతిలో ఈనెల 24, 25, 26వ తేదీల్లో అత్యంత ప్రతిష్టా త్మకంగా అమరావతి ఛాంపియన్‌షిప్-2025 పేరుతో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న జరగనున్న నేషన ల్ స్పోర్ట్స్ డేలో భాగంగా రాష్ట్రస్థాయి పోటీలకు తిరుపతి ఆతిధ్యమిస్తుందని తెలియజేశారు. జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు చేరుకున్నారని వివరించారు. రాష్ట్రస్థాయిలో హాకీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, కబడ్డీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో 2వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాశాఖామంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడాశాఖ ఉన్నతాధికారులు హాజరవనున్నట్లు పేర్కొన్నారు. 29వ తేదీన విశాఖపట్టణంలో జరిగే నేషనల్ స్పోర్ట్స్ డేకు సీఎం చంద్రబాబునాయుడు ముఖ్య అతిధిగా విచ్చేస్తారని, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఎం చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామని స్పష్టం చేశారు.

267 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశాం: కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పో యిన 267 మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాల యంలో కమిషనర్ టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటులో స్థలాలు కోల్పోయిన వారికి పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ఇందులో అందరి దరఖాస్తులు పరిశీలించి ఆన్లైన్ చేశామని అన్నారు. పలు మార్లు టిడిఆర్ కమిటీ సభ్యులు ఆన్లైన్ ద్వారా సమావేశమై అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న వారిని గుర్తించామని అన్నారు. ఈ ప్రక్రియలో ఇప్పటి వరకు 267 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ చేశామని అన్నారు. కాగా బుధవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటీ సమావేశంతో పాటు అన్ని పత్రాలను పరిశీలించి ఎంపిక చేశామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ సమావే శంలో డిసిపిఖాన్, ఏసిపిలు మూర్తి, మధు, టిపిఓ వంశీ, ప్లానింగ్ సెక్రటరీ లు పాల్గొన్నారు.